అగ్రాసనాధిపత్యము

౧

పొద్దున్నే లేచి, లేచీ లేవడంతోనే పిల్లిముఖమూ, వితంతువు ముఖమూ, దాసీదానిముఖమూ చూడకుండా, ఏ పునిస్త్రీ ముఖమో, లేకపోతే, యిష్టంగావున్నట్లయితే సొంత భార్యా ముఖమో, తులసెమ్మ ముఖమో చూచి, ఈ రోజుమట్టుకు ప్రపంచకంతో మనము ఖులాసాగా కాలక్షేపం చేయ వచ్చును గదా అనుకొని, కాలకృత్యములు తీర్చుకొని, కాఫీ పుచ్చుకొని, "ఈజీ" కుర్చీలో కూచుని న్యూసుపేపరులోని బొమ్మలో, ప్రకటనలో చూసుకుంటూండగా ఈసుఖోన్న తికి ఆటంకంగా ఎవరో వీధిగుమ్మందగ్గిరకు వచ్చి "ఫలానా వారున్నారండీ" అని పిలుస్తారు. ఈజీకుర్చీలోంచి లేవడానికి బద్ధకించి "ఎవరువారు? లోపలికి రావచ్చు" అంటాము. క్రాపింగు దువ్వుకొని, కరెక్టుడ్రెస్సు వేసుకొని, ఒక పెద్ద మనిషి ప్రవేశించి సలాంచేసి ఎదురుగా నిలబడుతాడు.

"అలా దయచెయ్యండి. ఎవరికోసం తమరు?"

"తమకోసమే వచ్చానండి. ఈవేళ మాస్కూల్లో డిబే టింగు సొసయిటీ మీటింగండి. (లేకపోతే) ఈవేళ టవున్ హాలులో మీటింగండి. తమరిని అగ్రాసనాధిపతిగా వుండ మని కోరడానికి వచ్చేనండి" అంటాడు.

"నేనేమీ లోకానికి అపకారం చెయ్యలేదే! నాఖర్మాన్ని నేను బతుక్కుపోతుంటే యీవుపద్రవ మేమిటి? ఎవడిమట్టుకు

వాడు బ్రతుకుతూవుంటే ఈలోకంలో ప్రజలు వాడిని ఆలాగ బ్రదకనివ్వరేమి?'' అని మనస్సులో అనుకొని పైకిమాత్రం గౌరవంగా ''అయ్యా మీస్కూలుసంగతి నాకు ఏమీ తెలియదు. మీకో స్కూలు ఈ వూళ్లో వుందనే సంగతే మీరిప్పుడు చెప్పిందాకా నాకు తెలియనే తెలియదే! ఆలాగంటి సందర్భంలో మీస్కూలు మీటింగుకు నేనగ్రాసనాధిపతిగా ఎట్లాగ వుండగలను'' అంటాము. అంటే ఆ ఆసామీ ఏమైనా వెనక్కుతగ్గుతాడా. వాదనప్రారంభిస్తాడు. ఆర్గ్యూ చేస్తాడు. బంకనక్కిరికాయలాగ పట్టుకు వదలడు. ఉచితానుచిత జ్ఞానం ఏమైనా వుంటేనా?

''అయ్యా! మీకు స్కూలు తాలుకుయావత్తు సంగతులూ మేము తెలియజేస్తాము. తప్పక మీ రుండితీరాలి''

''ఈగొడవలు తెలిసేవాళ్ళను కోరక నాదగ్గిర కెందుకు వచ్చావయ్యా''

''అలాగ గాదండి. తమరు తప్పకుండా ప్రిసయిడ్ చెయ్యాలి. నే నందర్నీ అడిగేను. ఎవరుమట్టుకు వారు ఏదో పనుందంటున్నారు. తమరుకూడా అలాగు సెలవిస్తే యింక విద్యావ్యాపకము విద్యాభిమానమూ.—'' ఇంకా ఏమేమో యీధోరణిని చెప్పుతాడు.

అతని వుద్దేశంలో నేను అగ్రాసనాధిపతిగా వుండడానికి వప్పుకోకపోవడం చాలా హీనమైన నేరముగా పరిణమించినట్లు స్పష్టము.

పోనీ తీరామొహమాటపడి వొప్పుకుంటామయ్యా. ఏమిటి దానికి పర్యవసానం? కోటుబూటూ తలపాగా తగిలించుకొని

కజ్జ చేత్తో పుచ్చుకొని చిరునవ్వులు నవ్వుకుంటూ సభా భవనము ప్రవేశించడం! ఈ చిరునవ్వు నిజంగా సంతోష సూచకము కాదు. ఇది విషపు చిరునవ్వు. మనస్సులో నిజంగా వున్నది బెంగ. మానవజాతిపై అసహ్యము, విరోధము. అందరూ వచ్చి సభ నలంకరించిన పిమ్మట—అలంకరించడం అంటే నిజంగా అలంకారముకాదు. కుర్చీలు నింపి కునికిపాట్లు పడడము. పెడతారన్న ఫలహారాలు యింకా పెట్టరేమి అనే ధుమధుమలు. ఎప్పటికి మీటింగు అంతమవుతుందో గదా ఎప్పటికి ప్రజలలో పడతామో అనే ఆదుర్దా—అందరూ వచ్చి సభ నలంకరించిన పిమ్మట ఒకడు లేచి వెఱ్ఱినవ్వునవ్వుతూ—

"ఫలానావారిని నేనగ్రాసనాధిపతిగా ఉపపాదిస్తున్నాను. అంటాడు. ఇంకోడు కుర్చీలోంచి సగం లేచి "నేను సెకండు చేస్తున్నా"నంటాడు. అందరూ చప్పట్లుకొడతారు. ఈవిధంగా నాటకం సాగుతుంది. ఇంక అగ్రాసనాధిపతో! తాను ఎప్పుడూ అనుకోని, తాను నిజముగానమ్మని విషయములను చేర్చి విద్యమీద పెద్దఉపన్యాసం చేస్తాడు. పెద్దపెద్ద బోధలూ ఉపదేశాలూచేస్తాడు. తాను ఆకాశాన్నుంచిఊడిపడ్డట్టూసభికు అందరూ మానవమాత్రులైనట్టూ నటిస్తాడు. ఉపన్యాసం ముగుస్తుంటె. అతడు సంతోషిస్తాడు. ఎందుకనీ? అమ్మయ్యా ఈగండం గడిచిందికదా అని! "ఈ గండం గడిచి ఈ పిండం బయటపడితే మొగుడుపక్కలో మొద్దులు పెడతానం"దట ఒక యిల్లాలు. ఆలాగుగా ఇతడుకూడ ఇంక బ్రతికివుండగా అగ్రాసనాధిపత్యం చెయ్యకూడదు అని దృఢసంకల్పం చేసు కుంటాడు. కాని ప్రజ లూరుకుంటారా! ఇంకో రెండురోజు

లకి మళ్ళీ యింకోచోట అగ్రాసనాధిపత్యము.

ఊరేగింపులూ, పూలదండలూ, కరతాళధ్వనులూ, యీ గౌరవములు పొందిన ఆసామీ తనఉచ్చస్థానము నిలుపుకొని, చెప్పుచేతలలో వుండే పదిమంది సహాయం పొందుతూవుంటే బాగుండును. ఆలాగు కుదరదే. తెల్లవారిలేస్తే యీ అగ్రాసనాధిపతి బజారుకు వెళ్లి ఒకచేత్తో నేతిచెంబూ, ఒకచేత్తో తెలకపిండీ, చంకలో ములకకాడలూ, బుజాన వంకాయలమూటా మొయ్యవలసివస్తోంది. అతడు బుర్ర వంచుకు నడిచేడంటే అతనిదా తప్పు!

కాని అగ్రాసనాధిపత్యం అందరికి యీమోస్తరుగా వుండదు. ప్రతిపూళ్లోనూ కొందరు పెద్దమనుష్యులు, తినడానికి కాస్తవున్నవాళ్లు, యీ వుద్యోగానికి దేవుళ్లాడుతూ వుంటారు. దీనిని వారు ఒకవృత్తిగా ఏర్పాటుచేసుకున్నారు ఇతరవృత్తులు లేకపోబట్టి. ఈ తెగ మనుష్యులు ఎక్కడేనా మీటింగులు పెడతారా, ఎక్కడికేనే మన్ని పిలుస్తారా, అని రోజురోజూ వుబలాటపడుతూవుంటారు. ఈ జాతి మానవులు ఎక్కడేనా మీటింగులు లేక కొంచెం మార్కెటు మందగించినట్లయితే క్రొత్తసభలూ క్రొత్తసంఘాలూ లేవదీస్తారు. 'అఖిలభారత మేకలసభా', 'అఖిలభారత చింతగింజలసభా,' 'సర్వాంధ్ర దర్జీసభా,' యిత్యాదిసభలు! సంఘాధ్యక్షులతో, సంఘోపాధ్యక్షులతో, కార్యదర్శులతో, కార్యనిర్వాహక ఉపసంఘములతో బయలు దేరుతాయి. మీటింగులమీద మీటింగులూ ఈమానవులకు పండుగ. ఈ జాతిమనుష్యు

లుపదేశింపలేని విషయములులేవు. వారికి తెలియని విష యము లంతకన్నా లేవు.

రాచకీయసభలు కానీయండి, సాంఘికసభలు కానీయండి, సంగీతసభలు కానీయండి, సాహిత్యసభలు కానీయండి, ఏవేనాసరే అగ్రాసనాధిపతులుగా ఉండడానికి వీరుతయారే !

వీరిట్లుండుటకు వుద్దేశము దేశోద్ధరణమే అని కొంద రంటారు.

కాదుకాదు, వీరి ప్రయత్నములకు పరమావధి బిరుదులని కొందరంటారు. ఈ జాతిమనుష్యులు ప్రతివూళ్ళోనూ వుండ బట్టే మనబోటి ఏమీ ఎరగని మంచివాళ్లకు ఉపద్రవాలు సంభవిస్తూ వుంటాయి. వారికి జబ్బుచేసినా వారు యితర గ్రామాల్లో అగ్రాసనాధిపత్యం చెయ్యడానికి వెల్లినా యీ ఉపద్రవం మనమీద వచ్చి పడుతుంది.

2

"శాస్త్రమపారమైనది. కాలము పరువులెత్తుకుపోతోంది" అన్నాడు ఒక ఆంగ్లకవి. మనవంశములోవున్న ఈ తక్కువ కాలాన్ని అగ్రాసనాధి పత్యములక్రింద వృధపుచ్చకుండా ఏదో లోకోపకారకమైన కార్యములను చెయ్యడానికి ప్రయ త్నించవలసినభారము ప్రతివానిమీద వున్నది.

ఈసంగతి గుర్తెరిగి సత్కార్యములకై కాలమును విని యోగము చేస్తూన్న ఒకపెద్దమనిషివున్నారు. ఆయన అసలు పేరు సత్యనారాయణశాస్త్రి. అయినప్పటికీ ఆయన తరుచు అష్టావధానము చేస్తూ వుండడాన్నిబట్టి ఆయనపేరు అష్టా వధాని అయిపోయినది. ప్రతివాడూ ఆయనను అష్టావధాని

అని పిలుస్తూవుంటారు. ఆయన బాగా చదువుకొన్నవాడనీ మంచికవిత్వం చెప్తాతాడనీ చాలా ప్రసిద్ధి. ఈయనికి సత్పాండిత్యముకలగడానికి ప్రధానకారణము ఆయనతండ్రిగారే. తండ్రిగారు తెలుగులలో మంచిప్రవేశంకలవాడుకావడంవల్ల కుమారుడిచేత చిన్నప్పుడే కావ్యాలన్నీ వల్లెవేయించినాడు. అరసున్నలుండే దేశ్యపదాలన్నీ బట్టివేయించినాడు. శకటరేఫలన్నీ మాటలపేర్లన్నీ పద్యరూపకంగా వల్లె వేయించినాడు. తాళ్లపాకవారి గ్రంథాలలోవున్న మాదిరిగా! ఆయనతండ్రిగారిది అంతపాండిత్యం. కొడుకుకుకూడా అంతపాండిత్యం వచ్చింది. ఈ అష్టావధానికి సారస్వత పరిశోధనలపై కొంత మట్టుకు బుద్ధిపారింది. కవిత్వంతోబాటు పరిశోధనలు చెయ్యడంకూడా మొదలుపెట్టేడు. ఈమధ్య ఆయన వ్రాసిన ఒకటి రెండు వ్యాసములు చాలా ప్రశంసనీయములు.

ఒకటి ఆయన ఆమధ్య పేదరాసిపెద్దమ్మమీద ఒక వ్యాసం వ్రాసి పత్రికలలో ప్రకటించినాడు. వేగి పత్రికలలో దానిని చాలాప్రశంసించినారు. ఆవ్యాసమునుండి కొద్దివిషయము లీక్రింద నుదహరిస్తున్నాను.

"పేదరాసిపెద్దమ్మ చారిత్రికస్త్రీ. ముసలమ్మలకథలలో ఆవిడ ప్రధానస్థానము నాక్రమించుకొని వున్నది. కథకునకు ఆమె చాలా సహాయకారిణి. కథాసందర్భము చాలా కష్టదశకువచ్చి కథ జరగకుండా వున్నసమయములో ఈపెద్దమ్మ ప్రవేశించి కథను అవ్యాహతంగా నడిపిస్తుంది. ఆమె సకుటుంబముగాకూడా కథకునకు సహాయము చేస్తూవుంటుంది. ఆవిడకు తెలియని భోగట్టాలేదు. ప్రయాణీకులు,

యాత్రికులు, పురుషులు, స్త్రీలు, జంతువులు, పక్షులు, అందరూ ఆమె సలహా పుచ్చుకుంటూనే వుంటారు. ఈకాలంలో, దిన, వార, మాసపత్రికలు చేసేపని ఆవిడ ఒక్కర్తే చేస్తూవుండేది పూర్వము.

ఆమె ఆంధ్రయువతి. ఆంధ్రలక్షణములు ఆమెయందు పూర్తిగా వున్నవి. ప్రతిభాశాలినియైన ఈ యాంధ్రకాంతను తలుచుకొని ఏ ఆంధ్రుడు గర్వపడడు!

బహుశా ఆమె పూటకూటింటిమనిషి కావచ్చును. లేక పోతే సత్రాధికారిణి కావచ్చు. పూటకూటిండ్లూ సత్రములూ చూచు తెలుగువారికి ఆమె పరిచయము తప్పకుండా కలిగి వుంటుంది.

కథలలో యిట్టి అద్వితీయ చాకచాక్యముచూపిన యీ చారిత్రిక స్త్రీని ప్రశంసింపని వారుండరు. ఇంగ్లీషులో ఛాసరు దొరగారు వ్రాసిన కావ్యాలలో ''హోస్టు'' ''మైన్‌హోస్టు'' అనే పురుషునకు యీమెకు కొంతవరకు పోలికలు కలవుగాని యీమెను సర్వవిధాలా పోలినవారు లోకంలో లేరు. ఇంగ్లీషు కావ్యములలోని వ్యక్తులకూ తెలుగు కథలలోని వేదరాసి పెద్దమ్మకూగల పోలికలను బట్టియూ ఇంగ్లీషుపదములకూ తెలుగుపదములకూ వున్నపోలికలను బట్టియూ ఇంగ్లీషువారికిని ఆంధ్రులకును రెండు చేతులా భోంచెయ్యడము ఆచారము కాబట్టిన్నీ (పరిషేచన చేసేటప్పుడు ఎడమచేతితో విస్తరిని తాకికుడిచేత్తో ప్రాణాహుతులు పుచ్చుకుంటారు ఆంధ్రులు.) ఇంగ్లీషువారియింటా ఆంధ్రులయింటా నిత్యాగ్నిహోత్రము లుండుట ఆచారము కాబట్టిన్నీ, ఇంగ్లీషువారు ఆంధ్రు

లగుదురా. అనేవిషయము ఇంకొకవ్యాసమున చర్చింపబడెను.

పేదరాసి పెద్దమ్మ దాత. ఈమె యింటికి వచ్చినవారిని ఆదరించి అతిథిసత్కారము చేస్తూవుండేది. అందరియెడలా ఆమె సానుభూతి చూపేది.

ఈగ తన పేరు మరచిపోయి ఈమెదగ్గిరకు వెళ్లి తనపేరడిగినప్పుడు తనకొడుకు నడగమంటుంది.

ఒకమారు యీవిడ కాళ్ళు పొయ్యిలో పెట్టుకొని అట్లు వండుతూవుండగా కోతి ఒకటివచ్చి ఆమెకు కట్టెలుయిచ్చి అట్లు పుచ్చుకొన్నది. ఇత్యాది విషయములబట్టి ఈమె గుణముల పుట్టయనీ, బుద్ధులపోగనీ, తోచకపోదు. ఇట్టి స్త్రీవతంసము నేడు విస్మరణీయమగుట విచారకరము"

ఈ అష్టావధానిగారు యింకొక వ్యాసము యీ మధ్య ప్రకటించినారు.

" రాజమహేంద్రవరము రాజమహేంద్రవరముకాదు " అనువిషయమును గురించి.

రాజరాజ నరేంద్రుడేలిన రాజమహేంద్రపురము నేడు వ్యవహారములో రాజమండ్రియని చెప్పబడుచున్న పట్టణము కాదని యీయనవాదము.

ఈ వాదమును బలపరుచుటకు అనేకములైన విషయముల నాయన ఉదహరించెను.

మహారాజులు పాలించిన మహాపట్టణమైతే యెంతకాలముగడచి నప్పటికీ కొద్ది చిహ్నాలేనా వుండక్కరలేదా?

ఆ మహాపట్టణము ప్రాకారములూ కందకములూ ఇంతలోనే రూపుమాసిపోయినవా?

సమీపమున రాజానగరమనే వూరువున్నది. నిజముగా రాజుగారి ఆవాసస్థానమది యేమో? రాజమహేంద్రవర మా ప్రాంతములలోనే వున్నదేమో ?

శ్రీనాథుడు వ్రాసిన పద్యమునుబట్టి దాఖలా అగుపిస్తున్నదంటారేమో! ఏవో రెండు దేవాలయములు ఆ దేవుళ్ల పేర్లతో వుంటేసరా? శ్రీనాథుడు వర్ణించిన ముల్లగూరిశక్తి ఎక్కడవున్నది? ప్రసిద్ధిజెందిన కోటిలింగ దేవాలయముమాట శ్రీనాథుడు చెప్పకపోవడ మేమి?

గోదావరి పూర్వము ప్రవహించే మార్గాన్నే యిప్పుడూ ప్రవహించుచున్నదని అనుకోవడమేమి? దానిమార్గము నది మార్చుకొన్నదేమో? ఇత్యాది పెక్కువిషయాలతో ఆయన వ్యాసము నిండియున్నది.

కొందరీ వ్యాసమును చదివి 'అష్టావధానికి మతిపోయింద'న్నారు. కొందరు 'ఆలోచించవలసిన విషయమే' అన్నారు.

ఈరీతిగా కాలక్షేపం చేస్తూన్న ఈ పెద్దమనిషిని, అష్టావధాని అనీ, పరిశోధకుడనీ, గొప్పవాడనీ గ్రహించి ఊళ్లో యెవళ్ళో పెద్దమనుష్యులు ఒకసభకు అగ్రాసనాధిపతిగా వుండమని కోరినారు!

ఏమిటో అనుకొని ఈ బ్రాహ్మడు సరే అన్నాడు. అన్ని సందర్భాలు తెలిసిన ఒక స్నేహితునిదగ్గిరకు పరుగెత్తుకు వెళ్ళేడు.

"ఏమయ్యోయి అష్టావధానీ యిలాగవచ్చేవు?"

"ఏముంది ఉన్నవాడిని వుండనియ్యకుండా ఈ ప్రజలు–"

"ఏమిచేసారు?"

"నన్ను ఒకసభకు అగ్రాసనాధిపతిగా వుండమనికోరినారు"

"వప్పుకున్నావా?"

"ఆ"

"ఇంకెందుకూ? నీకూ నాకూ ఈవేళతో స్నేహంసరి"

"ఏమి అది అంత అకార్యకరణమా?"

"ఇంకా నిమ్మళంగా అడుగుతున్నావా"

"ఎందుచేత?"

"లోకంలో ప్రసిద్ధిచెందడానికి అనేకమార్గాలున్నాయి. హత్యలుచేసి గొప్ప హంతకుడని పేరుపొందవచ్చు. చోరీలు చేసి గొప్ప చోర శిఖామణి అని ప్రతిష్ఠ సంపాదించవచ్చు తప్పుడుసాక్ష్యాలు తప్పుడు సంతకాలు, దోవలు కాయడాలు, గవర్నమెంటువుద్యోగాలూ ఎన్నిలేవు—నీవు అగ్రాసనాధిపతిగానే వుండాలా పేరు సంపాదించడానికి?"

"తీరా వప్పుకున్నాను మరి"

"ప్రపంచములో నాకు అన్నహితవు తప్పించేవిషయాలు కొన్ని వున్నాయి. ఇద్దరు ఆడవాళ్ళుచేరి సంభాషించుకొంటూంటే వారి మాటలుగానే నాచెవిని పడ్డట్లయితే ఆరోజు నాకు అన్న హితవు పోతుంది. ఖర్మంచాలక ఏరోజునేనా నేను ఇంగ్లీషువాడిముఖం చూడడం సంభవించినట్లయితే ఆరోజల్లా నాకు అన్నహితవుండదు. ఇంక ఎవరేనా అగ్రాసనాధిపతిని చూచినట్లయితే నాలుగయిదు రోజులదాకా నాకు లంకణములే."

"చ్చొచ్చొ, ఎంతపనికి వప్పుకున్నాను! ఈ హీనకార్యానికి నన్ను వడబరచినందుకు వాళ్ళమీద క్రిమినల్‌గా చర్యజరిపించాలి అనివుంది. నీసలహాఏమిటి?"

"అది గౌరవకార్యంగా ప్రజలూహిస్తున్నారయ్యా"

"పోనీ దీనిని నిషేధించడానికి ధర్మసూత్రాలేమీ లేవూ?"

"వుంటే యిక కావలసిందేమిటి?

"పోనీ శాసనసభలలో ఒకచట్టము ఈ సభ్యులందరూ ఏర్పాటుచేస్తే వారిపేరు శాశ్వతంగా వుంటుంది కాదూ?"

"నామొగుడే ప్రయోజకుడైతేనా అందిటఒకయిల్లాలు?"

"మరేమిటి సలహా?"

"శీఘ్రబుద్ధిః పలాయనం"

♦ ♦ ♦ ♦

అనుకొన్నరోజున ఆవూళ్లో సభజరగలేదు. అగ్రాసనాధిపతిలేనికారణాన్ని అష్టావధాని ఆరులంకణములుచేసి ఎలాగో తేరుకొని మళ్లీ ఆవూళ్లో అడుగు పెట్టలేదు.

1923